క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

లింగసముద్రం: మండలంలోని పెదపవని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదు, మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు నెల 31 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.స్నేహలత తెలిపారు. ముందు ఇచ్చిన గడువు ఈ నెల 24తో ముగియగా విద్యార్థినుల పరిస్థితులను బట్టి మార్చి 31 వరకు పొడిగించినట్లు చెప్పారు. ఈ ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 5వ తరగతిలోకి, పదోతరగతి చదువుతున్న విద్యార్థినులు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హులన్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

నేడు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

మర్రిపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని దివ్యాంగులకు సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ సుందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్‌పాస్‌లు కావాల్సిన వారు ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రూ.100 నగదుతో కార్యాలయానికి రావాలన్నారు. ఈ బస్‌పాస్ రాష్ట్ర వ్యాప్తంగా మూడు సంవత్సరాల పాటు చెల్లుబాటవుతుందని, ఈ అవకాశాన్ని మండలంలోని వికలాంగులు వినియోగించుకోవాలని కోరారు.

సామాజిక తనిఖీ గ్రామసభలు

లింగసముద్రం: మండలంలోని గ్రామాల్లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను తనిఖీ చేసి వివరాలను గ్రామసభల్లో తెలియజేస్తారని ఏపీఓ అబ్దుల్లా చెప్పారు. కుంటలు, కాలువలు, పూడికతీత పనులు, ఇరిగేషన్, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ కింద చేసిన పనులను సామాజిక తనిఖీ డీఆర్‌పీలు తనిఖీలు చేసి గ్రామల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు తెలియజేస్తారని చెప్పారు. తనిఖీలు నిర్వహించిన అనంతరం త్వరలో జరగనున్న సామాజిక తనిఖీలో డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు వెల్లడిస్తారని పేర్కొన్నారు.

వల్లూరమ్మ ఆలయంలో ప్రవచనాలు



ప్రవచిస్తున్న బాలబ్రహ్మానందసరస్వతి స్వాములు

టంగుటూరు: మండలంలోని వల్లూరులో గల వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం బాలబ్రహ్మానందసరస్వతి స్వాములు, నైమిశరణ్య పీఠాధిపతులు, హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు జగన్మాతదేవీ భాగవతం గురించి ప్రవచనాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈవో రమేష్, ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

త్రిపురాంతకం: మార్కాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో త్రిపురాంతకం ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో శని, ఆదివారాల్లో నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు పోలీసులు నిర్వహించారు. 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 కేజీల బెల్లం, 7 సీసాల నాటుసారాను స్వాధీనం చేసుకొని, కేశినేనిపల్లె గ్రామానికి చెందిన మాండ్రగుర్తి ఆదిలక్ష్మి, లేళ్లపల్లి గ్రామానికి చెందిన అలుగుసాని పుల్లయ్య, దువ్వలి గ్రామానికి చెందిన మాండ్రగుర్తి తిరుపతయ్యలను అదుపులోకి తీసుకున్నట్లు డీటీఎఫ్ పోలీసులు బాలరంగయ్య, చంద్రశేఖర్ తెలిపారు.

నల్ల బంగారం..!



గోతాలకు ఎత్తిన బొగ్గు బస్తాలు

- లాభాల బాటలో బొగ్గు తయారీ
- మండలంలో 20 ఏళ్లుగా బొగ్గు తయారీ బట్టీలు
- కోల్‌కత్తా ప్రాంతాలకు తరలుతున్న బొగ్గు
- టన్ను బొగ్గు రూ.18 వేల నుంచి రూ.20 వేల పలుకుతున్న ధర
- బొగ్గు తయారీతో కూలీలకు ఉపాధి
- ధర బాగుండటంతో వ్యాపారులకు మంచి లాభాలు

హనుమంతునిపాడు: బొగ్గు తయారీ లాభాల బాటలో నడుస్తోంది. మండలంలో దాదాపు రెండు దశాబ్దాలుగా బొగ్గు బట్టీలు ఉన్నాయి. గతంలో ఇతర ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి బొగ్గు తయారీ బట్టీలు నిర్వహించే వారు. కానీ ప్రస్తుతం స్థానికులే బొగ్గు తయారీ బట్టీలు ఏర్పాటు చేసి మంచి లాభాలు గడిస్తున్నారు. ఈ బట్టీలతో కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి దొరుకుతుంది.

20 ఏళ్లుగా బొగ్గు బట్టీలు..

మండల పరిధిలో గత 20 ఏళ్లుగా బొగ్గు తయారీ బట్టీలు విస్తారంగా ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో చిల్లక్రరతో పాడు ఇతర రకాల కర్ర తక్కువ ధరకు దొరకడంతో బొగ్గు తయారీ బట్టీలు బాగా విస్తరించాయి. బొగ్గు తయారీతో మంచి లాభాలు రాబడుతున్నారు. కూలీలకు మంచి ఉపాధి దొరుకుతోంది. గతంలో ఇతర ప్రాంతాల వారు వచ్చి ఇక్కడ బట్టీలు ఏర్పాటు చేసి మంచి లాభాలు ఆర్జించారు. దీంతో ఈ ప్రాంతం వారే ఎక్కువ మంది బట్టీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని వాలిచర్ల, హనుమంతాపురం, కూటాగుండ్ల, ముప్పాళ్లపాడు, నందనవనం ప్రాంతాల్లో బొగ్గు తయారీ బట్టీలను ఏర్పాటు చేసి బొగ్గు కాల్చి తయారు చేస్తున్నారు.

చిల్లకర్ర రూ.2500 కొనుగోలు

చిల్లకర్ర చెరువులు, కుంటలు, వాగులు, పొలం గట్ల ప్రాంతాలు, అడవి ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అడవిని తలపిస్తుంటాయి. పొగాకు బ్యారన్‌ల కాల్పుకు చిల్ల కర్ర వాడతారు. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు రోజు 20 ట్రాక్టర్ల వరకు తరలుతోంది. బొగ్గు తయారీ చేసే బట్టీల్లోనే కాటాలు ఏర్పాటు చేసి చిల్లకర్రను రైతుల వద్ద నుంచి రూ.2,500లకు కొనుగోలు చేస్తున్నారు. చిల్లకర్ర అమ్మకం, బొగ్గు తయారీతో వందల మంది ఉపాధి పొందుతున్నారు.

చిల్లకర్ర బొగ్గుకు మంచి గిరాకీ

చిల్లకర్రతో కాల్చిన బొగ్గుకు మంచి గిరాకీ ఉంది. చిల్ల కర్రతో తయారు చేసి బొగ్గు టన్ను రూ.18 వేల నుంచి రూ.21 వేల వరకు పలుకుతోంది. మండలం నుంచి ఎక్కువగా కోల్‌కత్తా వంటి ప్రాంతాలకు బొగ్గును ఎక్కువగా తరలిస్తున్నారు.

బస్తా బొగ్గు కాలిస్తే రూ.100 కూలి

బొగ్గును తయారు చేసేందుకు గూడు బట్టీలు, కర్ర బట్టీలు ఏర్పాటు చేస్తారు. కర్రను బట్టీలకు పేర్చి బొగ్గు కాల్చినందుకు బస్తా బొగ్గుకు రూ.100 కూలి ఇస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో బొగ్గు కాల్పుకు త్రిపురాంతకం, యర్రగొండపాలెం ప్రాంత కూలీలు కుటుంబసమేతంగా వచ్చి బొగ్గు కాలుస్తున్నారు. కాల్చిన బొగ్గును గోతాల్లో ఎత్తి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

మంచి లాభాలు వస్తున్నాయి

గత నెల వరకు బొగ్గుకు మంచి ధర పలికింది. గత నెలలో రూ.21 వేల నుంచి రూ.22 వేల వరకు టన్ను బొగ్గు ధర పలికింది. మంచి లాభాలు వచ్చాయి. కూలీలు కూడా మంచి ఉపాధి వచ్చింది. ప్రస్తుతం టన్ను బొగ్గు రూ.17 వేల నుంచి రూ.20 వేల వరకు పలుకుతోంది. గతంలో చిల్ల కర్ర టన్ను రూ.1500లకు వచ్చేది. ప్రస్తుతం రూ.2,500 వరకు పలుకుతోంది. కర్ర ధర బాగా పెరిగింది. బొగ్గు తయారీతో లాభాలు వస్తున్నాయి. కొంత మందికి ఉపాధి కూడా కల్పిస్తున్నాం

– నారాయణస్వామి,



కూటాగుండ్ల వద్ద కాలుస్తున్న బొగ్గు బట్టీ



ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు బొగ్గును లారీకి లోడు చేస్తున్న కూలీలు

ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం



ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంత మందికి వైద్య సేవలు అందిస్తున్నాం..వైద్య, సిబ్బంది కొరత ఎలా ఉంది, ఏమైనా తక్షణ చర్యలు తీసుకోవాలా.. అవేమీ చెప్పకుండా కేవలం నిధుల డ్రా కోసమే నాకు సమావేశానికి పిలుస్తావా.. మీరు రోగులకు పట్ల ఎలా వ్యవహరిస్తున్నారో.. దీని బట్టి అర్థమవుతుంది.'' అంటూ కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెంట్ అబ్దుల్ కలాంపై ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు అజెండాలోని 5 అంశాలను చదివి వినిపించారు. అందులో కేవలం ఆస్పత్రి డవలప్‌మెంట్ నిధుల నుంచి 2022–23కు సంబంధించి డ్రా చేయనున్న నిధులు, ఖర్చు, ఆస్పత్రిలో ట్యాంక్ పగులకొట్టుట, పనికిరాని వస్తువుల వేలం తదితర అంశాల ఆమోదం గురించి మాత్రమే చదివి వినిపించి మమ అని అనిపించారు. కనీస ఆస్పత్రిలో జరుగుతున్న వైద్య సేవలు, కనీస అవసరాల గూర్చి తెలపలేదు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే..ఏంటీ ఇది.. కనీసం అవగాహన లేదా.. సమావేశం ఎలా నిర్వహించాలో తెలియదా.. ? అజెండాలో ఏ అంశాలు పెడుతున్నారో, సభ్యులతో చర్చించరా? మిగతా సభ్యులంతా ఏరీ.. కేవలం నిధుల డ్రా కోసమే సమావేశం పెట్టినట్లు ఉంది.. అంటూ ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి లేచి బయటకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, ఎంపీడీఓ జీవీబీ మల్లికార్జున రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు సిద్ధం



విశిష్ట అలంకరణలో మూల విగ్రహమూర్తులు



నవమి ఉత్సవాలకు సిద్ధమైన కోదండరామస్వామి ఆలయం

పామూరు: శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మండల కేంద్రమైన పామూరులో శ్రీరామనవమి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం నుంచి సీతారామచంద్ర స్వామి ఆలయాల్లో ఉభయాలు, విశేష పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాలను మామిడి తోరణాలు, అరటి బోదెలు, ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆలయాల్లో సీతా రామచంద్రుల ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న వెంకటాద్రిపాలెం గ్రామ రైతులు

కందుకూరు అర్బన్: కందుకూరు మున్సిపాలిటీలోని వెంకటాద్రిపాలెం గ్రామ భూ సమస్యను అసెంబ్లీ సమావేశంలో రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని ఆ గ్రామ రైతులు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కలసి ధన్యవాదాలు తెలిపారు. భూ సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని వినతిపత్రం సమర్పించి రెవెన్యూ మంత్రికి ఆ వినతిపత్రాన్ని అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్ల నుంచి వెంకటాద్రిపాలెం, అనంతసాగరం, బడేవారిపాలెం, ఎడ్లూరుపాడు గ్రామాలు ప్రజలు ఈ భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు వివరించారు. గతంలో మీ ద్వారా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆనాటి ప్రకాశం కలెక్టర్‌కు ఈ సమస్యను పరిష్కరించాలని సూచించినట్లు గుర్తు చేశారు. రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాత ఈ సమస్యకు సంబంధించి పరిష్కారం జరగలేదన్నారు. ప్రసుత్తం సీసీఎల్‌లో ఈ భూ సమస్యకు సంబంధించి కేసు నడుస్తోందని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వెంకటాద్రిపాలెం రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధుల కోతపై దేశవ్యాప్త ఉద్యమం



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు జాలా అంజయ్య

పామూరు: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులో కోత విధించి తద్వారా నిర్వీర్యం చేయాలని చూస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు జాలా అంజయ్య అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం సాయంత్రం సీపీఎం పశ్చిమ ప్రకాశంజిల్లా కార్యదర్శి హనీఫ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అంజయ్య మాట్లాడుతూ కేంద్రం 2023–24 వార్షిక బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధుల కోత విధించడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 5న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఉపాధి పథకానికి రూ.లక్ష కోట్ల కేటాయింపుతో పాటు కూలీలకు 200 రోజుల పనిదినాలు, వేతనపెంపు, వేసవి అలవెన్స్‌లు మొదలైన సమస్యల పరిష్కారంకోసం ఛలోఢిల్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సీహెచ్.వెంకటేశ్వర్లు, వై.వి. నారాయణ, శివరామయ్య, ఇస్రాయేలు, అల్లాబక్షు, పలువురు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలి



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న ఏడీఏ సత్యన్నారాయణ

కనిగిరి రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా తక్షణం టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ సత్యన్నారాయణ అన్నారు. ఆదివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సత్యన్నారాయణ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన జీవాలకు నాలుకపై, కాళ్ల గిట్టలకు పుండ్లు ఏర్పడతాయన్నారు. చిన్న చిన్న దూడలు చనిపోతాయని, గేదెలు పాడి ఉత్పత్తి తగ్గిపోతాయన్నారు. ఎద్దులు, దున్నలు కోడెలు పొలం పనులు చేయలేవని తెలిపారు. టీకాలు వేయించుకోవాలని కోరారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

- ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు
- అక్క చెల్లమ్మల ఆనందమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం
- ఆసరా చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద వచ్చిన మహిళా గ్రూపులకు చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి పథకంలో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇస్తూ మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కరోనా కష్ట కాలంలో సైతం సంక్షేమ పథకాలను ఆపకుండా అర్హులందరికీ లబ్ధి చేకూర్చారన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఇచ్చిన మాట ప్రకారం మూడో విడత ఆసరా పథకంలో 7.89 లక్షల మహిళా సంఘాలకు రూ.6419.89 కోట్లు ఇవ్వగా, కనిగిరి మండలంలోని 661 గ్రూపులకు మూడో విడతలో రూ.4.22 కోట్లు నేరుగా మహిళల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు చెప్పారు.

మా పథకాలు అమలు చేస్తామని చెప్పగలరా..?

మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు, లోకేష్ బాబులకు సూటిగా ప్రశ్నిస్తున్నా.. మీరు అధికారంలో వస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు అమలు చేస్తామని చెప్పగలరా. కనీసం అంతకంటే మించిన పథకాలు ఇస్తామని చెప్పగలరా.. అంటూ సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో రుణమాఫీ కాదని, పథకాలే రద్దు చేశారని ఘాటుగా విమర్శించారు. 2016లో ఆగిపోయిన సున్నా వడ్డీ పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి అమలు చేసినట్లు వెల్లడించారు. అక్కా చెల్లమ్మల ఆనందమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో మహిళలకు తీవ్ర నష్ట జరిగిందని వివరించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాసులగురవయ్య, వైస్ ఎంపీపీలు తిరుపతిరెడ్డి, గాలిబోయిన ధనంజయ్, ఓకేరెడ్డి, మాజీ ఎంపీటీసీ జిలానీ, శ్రీహరిరెడ్డి, సిద్ధారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యులు రహీం, ఖాజా, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్, ఏపీఎం జీవరత్నం తదితరులు పాల్గొన్నారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మహిళా సంఘాల సభ్యులు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను సన్మానించారు.

జగనన్న పాలనలో రామరాజ్యాన్ని చూస్తున్నాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రామరాజ్యాన్ని చూస్తున్నాం. మహిళలు సంతోషంగా ఉంటేనే ఆ రాజ్యం బాగుంటుందనే ఉన్నత లక్ష్యంతో సీఎం అనేక పథకాలు అమలు చేస్తున్నారు. మహిళల కళ్లలో కాంతులు నిండిదే ఆ ఇళ్లు కాని, రాష్ట్రం గానీ సుభిక్షంగా ఉంటుంది. చంద్రబాబు పాలనలో మహిళలు కన్నీళ్లు పెట్టారు. అందుకే నాశనం అయ్యాడు. జగనన్న పాలనలో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి.. పంటలు పండుతున్నాయి. పాడి సంపద సంతోషంగా సాగుతుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను మనమంతా అండగా నిలిచి మరలా గెలిపించుకుంటామని తెలిపింది.

– వెంకట నర్సమ్మ,
యడవల్లి, కాశిప్రియా గ్రూప్

ప్రతిభ అవార్డు గ్రహీతకు సన్మానం

ఉలవపాడు: తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారానికి ఎంపికైన కిన్నెర బ్రహ్మయ్యను ఆదివారం ఉలవపాడులో ఘనంగా సన్మానించారు. జానపద కళారంగంలో విశేష ప్రతిభ చూపినందుకు ఈ నెల 31న వర్సిటీలో పురస్కారం అందచేయనున్నారు. ఉలవపాడులో కూడా పల్నాటి వీరచరిత్రను ఆయన జానపద కళారూపాల్లో ప్రదర్శించడంతో స్థానిక అంకమ్మ గుడి వద్ద గుడి నిర్వాహకులు సన్మానించారు. పురస్కారానికి ఎంపికవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. లింగసముద్రం మండలం వీఆర్‌కోటకు చెందిన ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు నిర్వాహకులు యరజొన్న సుబ్బారావు, మాధవరావు, చెన్నయ్య, బాలచంద్ర, తిరుపతమ్మ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.